క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాత పెద్దిరాజు దంపతులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ట్రస్టీలు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరుకు చెందిన చిట్టూరి పెద్దిరాజు–భారతిలక్ష్మి దంపతులు ఆదివారం రూ.10,116 విరాళం అందించారు. దాత దంపతులకు ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



తాటిపాకలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న ప్రబోధకులు

రాజోలు: మండలంలోని తాటిపాకలో ఆదివారం ఆషాఢ గురుపౌర్ణమి పురస్కరించుకుని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, మామిడికుదురు కమిటీ అధ్యక్షుడు బండారు సత్యనారాయణ, సభ్యులు అభిమన్యరాజు, బ్రహ్మాజీ, రామకృష్ణ, సుబ్బారావు, సత్యవతి పాల్గొన్నారు.

ప్రధాన రహదారిని అభివృద్ధి చేయండి



ఇసుకపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా ఉంది దానిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారిలో గుంటలు ఏర్పడి నడిచేందుకు వీలు లేకుండా ప్రమాద భరితంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో అటుగా వెళ్లే పాఠశాల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో ద్విచక్ర, సైక్లిస్టులు ప్రయాణించి ప్రమాదాల బారిన పడ్డారన్నారు. టీడీపీ హయాంలో రహదారిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి గాలికొదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.


మోదీ పాలనపై కరపత్రాల పంపిణీ



యర్రంశెట్టివారిపాలెంలో కరపత్రాలు పంచుతున్న బీజేపీ నాయకులు

పి.గన్నవరం: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ బీజేపీ నాయకులు ఆదివారం మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలో గృహ సంపర్క్ అభియాన్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కర పత్రాలను పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు చాగంటి గంగాధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరి గోపాలకృష్ణ, ఐ.మల్లేశ్వరరావు, పాటి సత్తిబాబు, మోకా వరప్రసాద్, మట్టపర్తి వెంకట నారాయణ, జల్లి వెంకటేశ్వర రావు, మేడిది సత్యనారాయణ, ఈతకోట ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాడ్మింటన్ టోర్నీకి నిఖిల్ వర్మ



మలికిపురం: మలికిపురానికి చెందిన దెందుకూరి నిఖిల్ వర్మ రాష్ట్ర స్థాయి అండర్–11 బాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి గోదావరి జిల్లాల స్థాయి అండర్–11 బాడ్మింటన్ పోటీల్లో డబుల్స్‌లో ప్రథమ స్థానం, సింగిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించిన నిఖిల్ వర్మ ఈ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు నిఖిల్ తెలిపారు.

జల్‌జీవన్‌తో ఇంటింటికీ తాగునీరు

- శివారు ప్రాంతాలకు పైప్‌లైన్ల ఏర్పాట్లు పూర్తి
- జగనన్న కాలనీల్లో వాటర్‌ట్యాంకుల ఏర్పాటు

ఆలమూరు: గోదావరి చెంతన ఉన్నా తాగునీటి సమస్య ఇప్పటి వరకూ అలానే ఉంది. భూగర్భ జలాల ప్రభావం వల్ల వేసవిలో తాగునీటి కొరత ఏర్పడేది. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్లు లేక సురక్షిత తాగునీరు అందే అవకాశం లేకుండా ఉండేది. గ్రామీణ ప్రాంత ప్రజలు తాగునీటి సమస్యలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వ నిధులతో జల్‌జీవన్ మిషన్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందే ఏర్పాట్లు చేస్తుంది. గతంలో ప్రతి మనిషికి అందిస్తున్న 55 లీటర్ల తాగునీరును 100 లీటర్లకు పెంచేలా ఈ జల్‌జీవన్ మిషన్ కృషి చేస్తుంది. గత నెలలో ఢిల్లీ నుంచి విచ్చేసిన గజన్ఫర్ అహ్మద్, అబ్దుల్ రహీమ్ ఖాన్ నేతృత్వంలోని జల్‌జీవన్ మిషన్ అధికారుల బృందం ఇంటింటికి తాగునీటి ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో పర్యటించింది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన రీతిలో సురక్షిత తాగునీరు అందించేందుకు వీలుగా ప్రజా ప్రతినిధులు, అధికారులకు సూచనలు, సలహాలను అందించి ప్రజలకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేసింది. అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలు పాటించి శివారు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతి ఇంటికి తాగునీరు అందించిన గ్రామాలకు స్టార్ రేటింగ్ ఇచ్చి గ్రామ పంచాయతీలను ప్రోత్సహించేందుకు జల్‌జీవన్ మిషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది.

అనేక గ్రామాల్లో పూర్తయిన ఇంటింటికి తాగునీరు

కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజవర్గాల్లోని 184 గ్రామాలు, 237 గ్రామ సచివాలయాలకు సంబంధించి 34 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటి పక్రియ తుది దశకు చేరుకుంది. మిగిలిన గ్రామాల్లో ఇప్పటి వరకూ 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఈనెలాఖరు నాటికి ఇంటింటికి తాగునీరు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఆలమూరు మండలంలోని జొన్నాడ, కలవచర్ల, నవాబుపేట, మడికి గ్రామాల్లోను, మామిడికుదురు మండలంలోని లూటుకుర్రు, గోడిలంక, అంబాజీపేట మండలంలోని ఇసుకపూడి, వక్కలంక, పసుపల్లి, తొండవరం తదితర గ్రామాల్లో ఇప్పటికే లక్ష్యాన్ని అధిగమించి ఇంటింటికి తాగునీరు అందించారు.

వైఎస్సార్ జగనన్న కాలనీల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం

రాష్ట్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరికి గూడు కల్పించాలన్న సదుద్దేశంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇప్పటికే ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలతో పాటు వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతుంది. కొత్తపేట నియోజకవర్గంలోని ఆలమూరు, దేవరపల్లి గ్రామాల్లో రూ.96.70 లక్షలతో 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యం



ఇంటింటికి తాగునీరు అందించడమే లక్ష్యంగా జల్‌జీవన్ మిషన్ పనిచేస్తుంది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పైప్‌లైన్ల నిర్మాణం పూర్తి చేశాం. అవసరమైన చోట వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నాం. ఒక్కొక్కరికి ప్రతి రోజు వంద లీటర్ల నీటిని అందించాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

– ఎం.పోశమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఆలమూరు



ఆలమూరులోని జగనన్న కాలనీలో చురుగ్గా సాగుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణం

జగన్‌ని మళ్లీ సీఎంను చేయాలి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- నాగుల్లంకలో గడప గడపకూ

పి.గన్నవరం: రాష్ట్రాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో కూడా అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని నాగుల్లంకలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే వెంకటేశ్వరరావు, చికిలే ప్రసాద్ తదితరులతో చిట్టిబాబు ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలియజేశారు. చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో కలసి ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని చిట్టిబాబు అన్నారు. మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు యల్లమెల్లి శ్రీను, గ్రంధి మురళి పాల్గొన్నారు.



నాగుల్లంకలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

వంతెన పనుల పరిశీలన

పి.గన్నవరం: చింతావారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య ప్రధాన పంట కాలువపై నిర్మిస్తున్న వంతెన పనులను ఎమ్మెల్యే చిట్టిబాబు ఆదివారం పరిశీలించారు. త్వరితగతిన వంతెన శ్లాబు పూర్తి చేయాలని ఆయన సూచించారు. గత ఏడాది వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల ప్రజల కష్టాలు ఎమ్మెల్యే చిట్టిబాబు ద్వారా తెలుసుకుని వశిష్ఠ నదీపాయపై రూ.49.5 కోట్లతో వంతెనను మంజూరు చేసిన విషయం విదితమే. ఈ ప్యాకేజీలో భాగంగా ముందుగా ప్రధాన పంట కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు శ్లాబు దశకు చేరుకున్నాయి. ఈ వంతెన పూర్తయిన అనంతరం వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణం పూర్తయితే ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు దొమ్మేటి దుర్గారావు, సాధనాల రమేష్ తదితరులు ఉన్నారు.

కాలువపై వంతెనతో నెరవేరుతున్న దశాబ్దాల కల..

ప్రధాన పంట కాలువపై ఉచ్చులవారిపేట, చింతావారిపేట మధ్య నిర్మిస్తున్న వంతెనతో ఆ రెండు పేటల ప్రజలకు ఎంతో మేలు జరుగనుంది. దశాబ్దాల తరబడి ఈ రెండు పేటల ప్రజలు పంట కాలువపై వంతెన లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లంకలోని వ్యవసాయ ఉత్పత్తులు గ్రామానికి తీసుకురావడానికి నానా అవస్థలు పడేవారు. ఎవరైనా మరణిస్తే, వారి మృతదేహాలను అరటి డొప్పలపై పంట కాలువ దాటించి శ్మశానానికి తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఈ కష్టాల నుంచి రెండు పేటల ప్రజలను గట్టెక్కించేందుకు.. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు వశిష్ఠ నదిపై వంతెన ప్యాకేజీలో భాగంగా ప్రధాన పంట కాలువపై ఇక్కడ వంతెన నిర్మించేందుకు కృషి చేశారు. త్వరలో ఈవంతెన పూర్తి కానున్న నేపథ్యంలో దశాబ్దాల నాటి సమస్యకు తెరపడనుంది.



పంట కాలువపై వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

నాణ్యమైన దిగుబడులకు

బీజామృతంతో విత్తనశుద్ధి

కొత్తపేట: బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన నాణ్యమైన ఉత్పత్తులతో కూడిన అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం బిళ్లకుర్రు యూనిట్ ఇన్‌చార్జ్ (ఎల్ 2) ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. మండలంలోని బిళ్లకుర్రు ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఆధ్వర్యంలో రైతులు సామూహికంగా జీవామృతంతో వరి విత్తనశుద్ధి నిర్వహించారు. ప్రస్తుతం ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయంపై యూనిట్ ఇన్‌చార్జ్ ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బిళ్లకుర్రు శివారు యెలిశెట్టివారిపాలెంలోని యెలిశెట్టి వెంకటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం బీజామృతంతో విత్తనశుద్ధి నిర్వహించారు.

బీజామృతం తయారీ.. ఉపయోగించే విధానం

ప్రకృతి వ్యవసాయం బీజామృతం తయారీ, ప్రయోజనాల గురించి యూనిట్ ఇన్‌చార్జ్ ఎంవీవీ ప్రసాద్ వివరించారు. 20 లీటర్ల నీటిలో 5 లీటర్ల గోమూత్రం, 50 గ్రాముల గుల్ల సున్నం కలిపి, ఆ ద్రావణంలో 5 కేజీల ఆవుపేడ గుడ్డలో కట్టి ఆ ద్రావణంలో 12 గంటలు నానబెట్టాలి. పేడకసర దిగి బీజామృతం తయారవుతుంది. ఈ ద్రావణం 10 ఎకరాలకు సరిపడా 200 కేజీల విత్తనాల శుద్ధికి సరిపోతుంది. ఈ బీజామృతంతో విత్తనశుద్ధి చేయడం వలన విత్తనం నుంచి, నేల నుంచి వ్యాపించే వ్యాధులు రాకుండా దోహదపడుతుంది. ఈ బీజామృతం కేవలం విత్తనశుద్ధికే కాకుండా నారుశుద్ధికి కూడా ఉపయోగపడుతుంది. వరి విత్తనాలకే కాకుండా కాయగూరలు, నారుకు కూడా ఉపయోగించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఫార్మర్ సైంటిస్టు కె.అరుణకుమారి, ఐసీఆర్‌పీలు యెలిశెట్టి వెంకటేశ్వరరావు, ఎం.సునీత, డి.శ్రీలక్ష్మి, కె.కళ్యాణి, కే అనితకుమారి, పలువురు రైతులు పాల్గొన్నారు.



యెలిశెట్టివారిపాలెంలో విత్తనశుద్ధి చేస్తున్న ఐసీఆర్‌పీలు, రైతులు

ఎన్‌ఆర్‌ఐ గోపిలీలకు తానా అవార్డు



ఆత్రేయపురం: గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ వేగేశ్న రామకృష్ణంరాజు (గోపిలీల)కు తానా మెరిటోరియస్ ఎక్సలెన్స్ ఇన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవార్డు దక్కించుకున్నారు. స్వదేశానికి వచ్చినప్పుడు ఉన్నత విద్యా సంస్థల్లో గెస్ట్ లెక్చరర్‌గా విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం, సమకాలీన సమాజంలో మన అవకాశాల గురించి వివరణాత్మక బోధన చేస్తారు. అలాగే గ్రామంలో పలు ప్రసిద్ధ ఆలయాలకు రూ.లక్షలు విరాళాలు అందించారు. పేద విద్యార్థులకు తమ సంస్థల ద్వారా తోడ్పాటు అందిస్తారు. గోపిలీలకు తానా అవార్డు రావడంపై ఆత్రేయపురం గ్రామంలో పలువురు అభినందిస్తున్నారు.


విలసలో వనువులమ్మ ఆలయంవద్ద చండీహోమం

అయినవిల్లి: మండలంలోని విలసలో వనువులమ్మ ఆలయం వద్ద శనివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ హోమం నిర్వహించారు. గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఈ హోమం నిర్వహించినట్లు తెలిపారు. అమ్మవారిని ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు దర్శించి పూజలు జరిపారు.

మహాలక్ష్మమ్మ, పోలేరమ్మలకు సారె సమర్పణ



భారీ ఊరేగింపుగా సారెను తీసుకొచ్చిన మహిళలు



విశేష అలంకరణలో మహాలక్ష్మమ్మవారు

యానాం: ఆదివారం ఆషాఢమాసంను పురస్కరించుకుని యానాం గ్రామదేవతలైన మహాలక్ష్మమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు ఆదివారం వనితా క్లబ్ తరపున సారెను సమర్పించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది మహిళలు అమ్మవార్లను దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. భారీ ఊరేగింపుగా బయలుదేరి సారెగా తీసుకొచ్చిన వివిధ రకాలైన పిండివంటలు, చలివిడి, వడపప్పు, పానకాలను అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ఆధ్యాత్మిక గీతాలతో అమ్మవారిని కీర్తించారు. కార్యక్రమంలో వాసవి వనితా క్లబ్ అధ్యక్షురాలు చింతలపూడి సర్వలక్ష్మి, కార్యదర్శి బొండాడ కాశి అన్నపూర్ణ, కోశాధికారి దంగేటి మణిజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గున్నేపల్లి సత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముమ్మిడివరం: ఆషాఢమాసం ఆదివారం కావడంతో ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. వివిధ రకాల పండ్లతో అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. జిల్లా నలుమూల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దాతల సాయంతో పులిహోర, బూరెలతో పాటు చంటి పిల్లలకు పాలు పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ అమ్మవారు

సుబ్బాలమ్మ సేవలో ఆటోవర్కర్లు

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరు ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ సేవ, జాతర మహోత్సవం ఆదివారం జరిగింది. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సేవలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారి ఆలయం నుంచి ఆటో స్టాండ్ వరకూ భారీ ఊరేగింపు సాగింది. బాణసంచా కాల్పులతో విచిత్ర వేషాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగింపు వైభవంగా జరిగింది. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, ఊటాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్బాలమ్మ సేవలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

వై.కొత్తపల్లి గ్రామశాఖ నూతన కార్యవర్గం

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ వై.కొత్తపల్లి గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా కత్తుల పెద్దిరాజు, దొమ్మేటి శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. గ్రామ సర్పంచ్ తోరం వీవీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ నవుండ్రు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు గుర్రం సత్యనారాయణ, పుచ్చకాయల ఏసు, యన్నపు పెద్ద, కె.నాగేశ్వరరావు, తరపట్ల సింహాచలం, బద్దే ప్రకాశరావు, జి.రమణ,వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వై.కొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ నాయకులను అభినందిస్తున్న దృశ్యం

ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

అమలాపురం రూరల్: ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్ పరీక్షలకు సిద్ధమవుతున్న 80 మంది పోలీస్ ఉద్యోగార్థులకు శ్రీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోకా రమాదేవి, విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబుల చేతుల మీదుగా ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సభలో డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ ప్రతి అభ్యర్థి కష్టపడి పరీక్షలో విజయం సాధించాలని, అందుకు అవసరమైన తోడ్పాటును తాము అందిస్తామని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు ఎలా సన్నద్ధమైతే విజయం సాధించొచ్చో మాజీ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది పెయ్యల శ్రీనివాసరావు, ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, మాజీ సర్పంచ్ నక్కా సంపత్, నక్కా చంద్రశేఖర్, పెనుమాల చిట్టిబాబు, బళ్ళ సత్యనారాయణ, గూటం సాయి, విజయ బాబు పాల్గొన్నారు.



పోలీస్ ఉద్యోగార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు

యువకుడికి గాయాలు

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో ఆదివారం ఓఎన్‌జీసీ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీ కొట్టడంతో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పలగుప్తం పంచాయతీ ఆదిలక్ష్మీపురానికి చెందిన పి.శేఖర్ తన తల్లితో కలిసి మోటారుసైకిల్‌పై అమలాపురం వెళుతున్నారు. గొల్లవిల్లి ఓఎన్‌జీసీ సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రక్కు ఆటో వారిని ఢీకొట్టి బోల్తా పడింది. ప్రమాదంలో శేఖర్‌కు కాలు విరిగిందని, అతడి తల్లి సురక్షితంగా ఉందని స్థానికులు తెలిపారు. స్థానికులు 108 అంబులెన్సులో శేఖర్‌ను ఆసుపత్రికి తరలించారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు ఉచితంగా అందించే వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. గంగలకుర్రు సచివాలయం వద్ద అంబాజీపేట ఉషా డయబెటిక్ అండ్ జనరల్ కేర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన రోగులను వైద్యులు డీవీ సత్యం, వాసంశెట్టి రేణుకలు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష

ఆలమూరు: మండలంలోని మడికి-1, జొన్నాడ-1 గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం జగనన్న సురక్ష నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాసు, నామాల శ్రీనివాసు తెలిపారు. వారు మాట్లాడుతూ మడికిలో తహసీల్దార్ ఐపీ.శెట్టి నేతృత్వంలో గ్రామ సచివాయలం వద్ద, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో రైతు భవనం వద్ద శిబిరాలను ఏర్పాటు చేయనున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ధ్రువపత్రాలను మంజూరు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రేపు ముంగండలో కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండలోని మంత్రవాది ఇందిరా కుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యులు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

స్వామి సన్నిధిలో అడిషనల్ ఎస్పీ



స్వామి వారి ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామిని ఆదివారం సాయంత్రం పశ్చిమ గోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ ఎ.వెంకటసుబ్బారావు-లక్ష్మీదేవి దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి అర్చకులు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న అనంతరం అర్చకులు స్వామి వారి ఆశీస్సులు అందజేశారు. ఆలయ ఈఓ జి.మాధవి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు చిట్టాల సత్తిబాబు అడిషనల్ ఎస్పీకి స్వామి వారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు.

తొలి మహిళ కవయిత్రి మొల్లమాంబ



రాజోలు కాటన్ పార్కులో మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: తెలుగు రామాయణం రచయిత, తొలి తెలుగు మహిళ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం రాజోలు కాటన్ పార్కులో మొల్లమాంబ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, సంస్కృతంలో ఉన్న రామాయణాన్ని సరళమైన తెలుగులోకి అన్వయించిన కవయిత్రి మొల్లమాంబ అని తెలిపారు. కోనసీమ కుమ్మరి శాలివాహన లీడర్ పి.వెంకట రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, కుమ్మరి శాలివాహనులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాకంబరిగా అన్నపూర్ణాదేవి



శాకంబరిగా దర్శనమిచ్చిన అన్నపూర్ణాదేవి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో కొలువైన అన్నపూర్ణాదేవిని ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు అన్నపూర్ణ అమ్మవారిని వివిధ కూరగాయలతో అలంకరించారు. భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం - అంతర్వేది

'ఇ' ప్రొక్యూర్‌మెంటు టెండరు ప్రకటన

ఆర్.సి.నెం.ఎ1/128/2023. తేది.09.07.2023

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మం, అంతర్వేది గ్రామములో వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానమునకు ఈక్రింది ఐటమ్స్‌నకు eprocurement ద్వారా ది.25.07.2023 ఉదయం గం॥11.00లకు టెండర్లు నిర్వహింపబడును. 'ఇ' ప్రొక్యూర్‌మెంటు పెద్మాలు కొరకు www.eprocurement.gov.in (or) https://tender.apeprocurement.gov.in ద్వారా లాగిన్ అయి apendowments marketing నుండి ది.11.07.2023 మ॥గం॥ 2.00 నుండి ది.24.07.2023వ తేది మ॥గం॥ 2.30ని॥ల వరకు బిడ్ సమర్పించవచ్చును.

వ.నెం.	టెండరు వివరము	కాలపరిమితి	ధరావత్తు	రిమార్కు
1.	రసవర్గములు (కిరాణా) పూజా ద్రవ్యములు, శానిటేషన్ మరియు డిస్పోజబుల్ సామగ్రి	01-10-2023 నుండి 31-03-2024 వరకు (6 నెలల కాలమునకు)	2,00,000.00	'ఇ' ప్రొక్యూర్‌మెంటు టెండరు

ఇతర వివరములకు దేవస్థానం కార్యాలయ పని వేళలలో సంప్రదించవలెను. సదరు టెండర్లు ఖరారు చేయుటకుగాని, వాయిదా వేయుటకుగాని, టెండరు తిరస్కరించుటకుగాని, మార్పు చేయుటకుగాని దేవదాయ ధర్మదాయశాఖ వారికి అధికారము కలదు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్. 9989956256.

ది.9-07-2023 చైర్మన్ & ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కార్యనిర్వహణాధికారి